
సాక్షి కర్నూలు

శనివారం । 20 । మే । 2023



ప్రవేశాలు 'ఫుల్'

రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో సర్కార్ స్కూళ్లలో ప్రవేశాలు ఏడాదికేడాదికి పెరుగుతున్నాయి. విద్యార్థులు ఎక్కువ కావడంతో నో అడ్మిషన్ బోర్డులు పెడుతున్నారు. 10లో▸



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం: నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సూర్యప్రసాద్, అరవింద ఆర్ట్ అకాడమీ (అనంతపురం) వారి సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



భ్రామరీకి ఊయల సేవ

శ్రీశైలం: భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు శుక్రవారం పౌర్ణమి సందర్భంగా ఊయల సేవ చేపట్టారు. ముందుగా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

రాజగోపుర నిర్మాణానికి రూ. 3 లక్షల విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శుక్రవారం భక్తులు రూ.3 లక్షలను విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్నూలుకు చెందిన నాగేంద్రప్రసాద్ రూ.2 లక్షలు, నంద్యాలకు చెందిన వీరేష్‌కుమార్ రూ.లక్ష అందజేసినట్లు చెప్పారు. ఆలయ అభివృద్ధికి భక్తులు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు.

పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు రంగం సిద్ధం

- జూలై 1 నుంచి కార్యక్రమం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణకు రంగం సిద్ధమైంది. కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 పీఏసీఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుతం 2022-23 సంవత్సరంలో నిర్వహించిన లావాదేవీలకు సంబంధించి ఆడిట్ జరుగుతోంది. ఈ కార్యక్రమం జూన్ చివరికి పూర్తవుతుంది. జూలై 1 నుంచి పీఏసీఎస్‌ల కంప్యూటరణ కార్యక్రమాన్ని చేపడుతారు. ఇప్పటికే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 పీఏసీఎస్‌ల సీఈఓలు, కంప్యూటర్ ఆపరేటర్లకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో బేసిక్ ఓరియంటేషన్ ట్రైనింగ్ పూర్తయింది. జూన్ చివరి నాటికి కంప్యూటరీకరణ పూర్తి కాగానే పీఏసీఎస్‌ల్లో లావాదేవీలన్నీ ఆన్‌లైన్ కానున్నాయి. ఫలితంగా లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ముగిసిన ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు

కర్నూలు సిటీ: ఏపీఈఏపీ సెట్‌లో ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు ఈ నెల 15వ తేదీన మొదలై శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున ఉదయం మాత్రమే పరీక్ష నిర్వహించారు. శుక్రవారం పరీక్షకు కర్నూలు జిల్లాలో 1,236 మందికిగాను 1188 మంది, నంద్యాల జిల్లాలో 525 మందికి గాను 498 మంది హాజరైయ్యారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు మొత్తంగా కర్నూలు జిల్లాలో 9,203 మందిగాను 8723 మంది, నంద్యాల జిల్లాలో 4,395 మందికి గాను 4,154 మంది హాజరయ్యారు.

రేపటి నుంచి అగ్రికల్చర్-ఫార్మసీ పరీక్షలు

అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలను రేపు(ఆదివారం), సోమవారం ఉమ్మడి జిల్లాలో 12 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లా నుంచి 7,462 మంది, నంద్యాల జిల్లా నుంచి 2,205 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారు.

22లోగా ఇంజనీర్ల సర్వీసు వివరాలివ్వండి

కర్నూలు(అర్బన్): ఉద్యోగుల సాధారణ బదిలీల నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆయా డివిజన్లు, సబ్ డివిజన్ల ఇంజనీర్ల సర్వీసు వివరాలను ఈ నెల 22వ తేదిలోగా పంపించాలని పీఆర్ పర్యవేక్షక ఇంజనీరు కె.సుబ్రమణ్యం కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ కేడర్లలో దాదాపు 200 మంది ఇంజనీర్లు పని చేస్తున్నారన్నారు. వీరిలో రెండు నుంచి ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారి వివరాలను పంపాలన్నారు. సంబంధిత ఈఈలు ఆయా సబ్ డివిజన్ల నుంచి సమాచారాన్ని తెప్పించుకొని పంపించాల్సి ఉందన్నారు. తమకు అందిన సమాచారాన్ని అదే రోజున అనంతపురం ఎస్ఈ కార్యాలయానికి పంపుతామన్నారు.

అర్హులందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన

- దరఖాస్తుకు ఈ నెల 31 ఆఖరు

కర్నూలు(అర్బన్): జిల్లాలో అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు జగనన్న విదేశీ విద్యా దీవెనకు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి ఎస్‌పీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి పలు సవరణలు చేసి పునః ప్రారంభించిందన్నారు. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ ప్రకారం టాప్ 100 యూనివర్సిటీల్లో సీటు సాధించే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. టాప్ 100 - 200 ర్యాంకింగ్స్‌లో ఉన్న యూనివర్సిటీల్లో సీటు పొందిన వారికి రూ.50 లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందన్నారు. వార్షిక ఆదాయ పరిమితి రూ.8 లక్షల్లోపు ఉండి 35 ఏళ్ల లోపు వయస్సు విద్యార్థులు అర్హులన్నారు. కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. అర్హులు httpr://jna nabhumi.apcfrr.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అనుభవదారులకే పట్టాభిషేకం!



ఎన్నో ఏళ్ల కల నెరవేరుతోంది. రెక్కల కష్టంతో సాగులోకి తెచ్చిన ప్రభుత్వ భూమి సొంతమవుతోంది. అనుభవదారులకే అన్ని హక్కులూ కల్పిస్తూ ప్రభుత్వం డీ పట్టాలు జారీ చేయనుంది. ఇందుకోసం అసైన్‌మెంట్ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అనుమతులు వచ్చిన వెంటనే అర్హులైన రైతులకు 'పట్టా'భిషేకం చేసేందుకు రంగం సిద్ధమైంది.

- ప్రభుత్వ భూమిని అనుభవిస్తున్న రైతులకు త్వరలో సాగు పట్టాలు
- 14 ఏళ్ల తరువాత అసైన్‌మెంట్ కమిటీల నియామకం
- జిల్లాలో 4,493 మందికి 5,713.74 ఎకరాల పంపిణీకి నివేదిక
- ఆమోదముద్ర పడగానే రూ.385 కోట్ల విలువ చేసే భూములపై పేదలకు హక్కులు

పట్టాలు ప్రతిపాదించిన సాగుభూమి వివరాలు

నియోజకవర్గం పేరు	అనుభవందారుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములు	అనుభవందారుల సంఖ్య
పత్తికొండ	1370.03	1,044
ఆలూరు	1271.02	1,013
ఆదోని	233.11	278
మంత్రాలయం	1306.18	796
ఎమ్మిగనూరు	746.01	699
పాణ్యం	697.5	581
కోడుమూరు	89.89	82
కర్నూలు	భూమి లభ్యత లేదు	లబ్ధిదారులులేరు

కర్నూలు(సెంట్రల్): పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఇంటి స్థలాన్ని ఇచ్చింది. పక్కా గృహాలను కూడా మంజూరు చేసింది. అలాగే పేదల అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూములపై హక్కులు కల్పించే బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతేడాది ఆగస్టులో పచ్చజెండా ఊపారు. సీఎం ఆదేశాలతో జిల్లా అధికార యంత్రాంగం అర్హుల జాబితా రూపకల్పన చేసింది. కర్నూలు జిల్లాలో 4,493 మంది అనుభవందారులు ఉన్నట్లు గుర్తించారు. వీరి ఆధీనంలో ఉన్న 5,713.74 ఎకరాల భూమికి డీ-పట్టాలు ఇవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన కొనసాగే అసైన్డ్ కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. అక్కడ ఆమోద ముద్ర పడగానే పేదల సాగుచేసుకుంటున్న భూమిపై సర్వహక్కులు సిద్ధిస్తాయి. ప్రభుత్వ భూమిని సాగుచేసుకుంటున్న పేద రైతులకు తడి అయితే రెండున్నర, మెట్ట అయితే ఐదెకరాలకు మించకుండా డీ-పట్టా ఇవ్వానున్నారు.

అర్హుల ఎంపికకు ప్రత్యేక కమిటీ

సాగుభూమికి సంబంధించి రైతులకు పట్టా ఇచ్చేందుకు ప్రత్యేకంగా అసైన్‌మెంట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కమిటీ చైర్మన్‌గా జిల్లా ఇన్ చార్జిమంత్రి వ్యవహరిస్తారు. మెంబర్ కన్వీనర్‌గా జాయింట్ కలెక్టర్, మెంబర్లుగా జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, ఆర్‌డీఓ ఉంటారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్సీ ఉంటారు. ప్రభుత్వ ప్రకటన అనంతరం వీలైనంత త్వరలో పట్టాలు అందజేసేందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

4,493 మంది రైతులకు లబ్ధి

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమిలో ఎంతమంది సాగులో ఉన్నారన్న విషయాన్ని తెల్చేందుకు జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో అధికార యంత్రాంగం గుర్తింపు ప్రక్రియను చేపట్టింది. ప్రతి గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించి అర్హుల జాబితాను సిద్ధం చేసింది. మొత్తం 4,493 మంది అనుభవందారులకు 5713.74ఎకరాల భూమికి పట్టాలు అందజేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఈ భూములన్నీ వ్యవసాయానికి అనువైనవే. ఈ మేరకు అసైన్‌మెంట్ కమిటీ ప్రభుత్వానికి డీ పట్టాలు ఇవ్వడానికి నివేదించాయి. అక్కడ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగానే రూ.385 కోట్ల విలువైన భూములకు రైతుల పేరిట హక్కులు సిద్ధిస్తాయి.

అర్హతలు ఇవే..

- సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూమి తప్ప రైతులకు ఇతరాత్ర పట్టా భూమి ఉండకూడదు.
- సాగు చేసుకుంటున్న భూమిని ఇంతకుముందు ఎవరికీ డీ-పట్టా ఇచ్చి ఉండకూడదు.
- దరఖాస్తులో పొందుపరచిన భూమిలో సదరు రైతు తప్పనిసరిగా సాగుచేసుకుంటూ ఉండాలి.
- అన్ని అర్హతలతో జిల్లా ఇన్‌చార్జిమంత్రి ఆధ్వర్యంలో జరిగే అసైన్‌మెంట్ కమిటీలో ఆమోదం పొందాలి.
- అర్హత ఉన్న రైతుకు తడి అయితే 2.5 ఎకరాలు, మెట్ట అయితే ఐదెకరాల మించకుండా డీ పట్టా మంజూరు చేస్తారు.

ఈ భూములు ఇవ్వరు...

ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పొరంబోకు, వాగులు, వంకలు, కొండలు, గుట్టలకు పట్టాలు ఇవ్వరు. వ్యవసాయ యోగ్యమైన భూమిని మాత్రమే అసైన్ చేస్తూ డీ-పట్టా ఇస్తారు. గతంలో పట్టాలు ఇచ్చిన, ప్రభుత్వ, ఇతర అవసరాలకు వినియోగించే ఆలోచన ఉన్న భూములకు పట్టాలు ఇవ్వరు.

పారదర్శకంగా అర్హుల ఎంపిక



ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారికి హక్కులు కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది. అందుకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ భూమిని సాగు చేస్తున్న వారిని గుర్తించాం. అర్హుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ..ఎలాంటి అవినీతి. ప్రలోభాలకు తావులేకుండా చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 4,493 మంది అనుభవందారులకు 5,713.74ఎకరాల పంపిణీకి సంబంధించి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదించాం. అర్హుల జాబితాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన పేదల అధికంగా ఉన్నారు. ప్రభుత్వం ఆమోదం పొందగానే డీ-పట్టాల పంపిణీకి చర్యలు తీసుకుంటాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ భూమి దక్కుతుంది.

– నారపురెడ్డి మౌర్య, జేసీ, కర్నూలు

14 ఏళ్ల అనంతరం..

పేదలకు భూ హక్కులు కల్పించే కార్యక్రమాన్ని 14 ఏళ్లుగా ఏ ప్రభుత్వం చేపట్టలేదు. గతంలో వైఎస్ఆర్ హయాంలో పేదలకు డీ-పట్టాలు ఇచ్చారు. కర్నూలు జిల్లాలో వైఎస్ఆర్ హయాంలో దాదాపు 6 వేల మందికి పట్టాలు ఇచ్చారు. తరువాత ఆయన తనయుడైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ఈ బృహత్తర కార్యక్రమానికి మళ్లీ శ్రీకారం చుట్టారు. సీఎం నిర్ణయంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు భూమి కావాలన్న కొన్నేళ్ల కోరిక నెరవేరనుందని ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా పూజిత



బాధ్యతలు స్వీకరిస్తున్న నీలం పూజిత

కర్నూలు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ప్రాంతీయ అధికారి(ఆర్‌వీఈఓ)గా నీలం పూజిత నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో సెబ్ అడిషనల్ ఎస్పీగా పని చేస్తున్న నీలం పూజితను కర్నూలుకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనంతపురం పట్టణానికి చెందిన ఈమె 2012 గ్రూప్-1 బ్యాచ్ అధికారి. ప్రొద్దుటూరు, తెలంగాణ రాష్ట్రంలోని సూర్యపేట, హైదరాబాద్ సిటీ సెంట్రల్ క్రైం స్టేషన్, ఏపీ సీఐడీ విభాగాల్లో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. 2021లో అదనపు ఎస్పీగా పదోన్నతి పొంది కడప సెబ్ విభాగంలో పనిచేస్తుండగా తాజా బదిలీల్లో ఆమెను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కర్నూలు ఆర్‌వీఈఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల రోజుల క్రితం జరిగిన ఎస్పీల బదిలీల్లో కర్నూలు విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న తిరుమలేశ్వర్‌రెడ్డి నెల్లూరు జిల్లా ఎస్పీగా బదిలీపై వెళ్లడం తెలిసిందే.

పేదల ద్రోహి చంద్రబాబు

- పేదలకిచ్చే స్థలాలను సమాధులతో పోల్చడంపై వైఎస్సార్‌సీపీ నాయకుల నిరసన



మద్దికెరలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, చిత్రంలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

కర్నూలు(రాజ్‌విహార్): అమరావతిలో పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే స్థలాలను మాజీ సీఎం చంద్రబాబు సమాధులతో పోల్చడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. పేదల ద్రోహి చంద్రబాబు అంటూ నినదించారు. టీడీపీ అధినేత దిష్టిబొమ్మలను దహనం చేశారు.

- మద్దికెరలో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వమించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.
- కోడుమూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ప్రభాకర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.
- కర్నూలు పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు మద్దయ్య, కేదార్‌నాథ్, మాజీ మేయర్ బంగి అనంతయ్య నిరసన చేపట్టారు.
- ఆలూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి వైఎస్ఆర్‌సీపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని ర్యాలీ నిరన్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ, నాయకులు ఈరన్న, వీరేష్ పాల్గొన్నారు.
- ఎమ్మిగనూరు సోమప్ప సర్కిల్ వద్ద చంద్రబాబు నాయుడు దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ నేత ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రఘు, మాజీ చైర్మన్ రంగయ్య పాల్గొన్నారు.
- కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్పొరేటర్లు శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, అరుణ, శ్వేతారెడ్డి పాల్గొన్నారు.
- డోన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, డోన్ మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పాల్గొన్నారు.
- శిరివెళ్లలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు చంద్రబాబు దిష్టి బొమ్మను దహనం చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దులసలాం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

87 కేంద్రాల్లో సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లమెంటరీ పరీక్షలకు జిల్లాలో 87 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్యశెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేది వరకు నిర్వహిస్తామన్నారు. కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లు, కస్టోడియన్లను నియమించామన్నారు. పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్)కాలేజీలో నేటి ఉదయం 10 గంటలకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వలంటీర్ల సేవలకు సలాం

- విమర్శకులను పట్టించుకోవాల్సిన అవసరం లేదు
- మీరంతా జగనన్న సైన్యం
- అవార్డులకు ఎంపికైన వారికి సన్మానం చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ ఏ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జే సుధాకర్ తదితరులు



హాజరైన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల చెంతకు చేరుస్తూ వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని, వీరి సేవలకు సలాం అని ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, డాక్టర్ జె. సుధాకర్ అన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలందించారని, ఎవరో చేసే విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, వలంటీర్లు అంతా జగనన్న సైన్యమని పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవార్డులకు ఎంపికైన కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే వలంటీర్లను సన్మానించారు. అంతకు ముందు విజయవాడ నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వలంటీర్లకు వినిపించారు. కర్నూలు జిల్లాలో మొత్తం 9,161 మంది వలంటీర్లు అవార్డులకు ఎంపిక కాగా..అందులో 38 మంది సేవావజ్ర, 169 మంది సేవారత్న, 8,963 మంది సేవామిత్ర కింద పురస్కారాలు అందుకున్నారు. ఎంపిక వారి మొత్తాలకు సంబంధించిన మెగా చెక్కును ప్రజాప్రతినిధులు, అధికారులు వలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎస్.మౌర్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

- కలెక్టర్ డాక్టర్ గుమ్మళ్ల సృజన మాట్లాడుతూ.. వలంటీర్ల సేవలు కేవలం పింఛన్ల పంపిణీకి మాత్రమే అన్నది అపోహ అన్నారు. వారి సేవలను విద్య, వైద్యం, ఇతర సామాజిక కార్యక్రమాలను కోసం కూడా వినియోగిస్తున్నామన్నారు. వలంటీర్లను ఉత్సాహపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులతో సన్మానిస్తోందన్నారు.
- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ..కరోనా సమయంలో ఆప్తబంధువులుగా వలంటీర్లు సేవలు అందించారని కొనియాడారు. వారి సేవలను ప్రోత్సహించడానికే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవార్డులను అందిస్తున్నారన్నారు.
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ.. వలంటీర్ అంటే స్వచ్ఛంద సేవకుడు అని, వారిసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగంచేసుకోవాలన్నారు.
- ఎమ్మెల్సీ డాక్టర్ ఎ.మధుసూదన్ మాట్లాడుతూ..ప్రభుత్వం పథకాలకు అర్హులను ఎంపిక చేసే బాధ్యత వలంటీర్లకు ఉందంటే వారికి ఉన్న ప్రాధాన్యతన అర్థం చేసుకోవచ్చన్నారు. వలంటీర్ వ్యవస్థ ఎంతో పటిష్టంగా పనిచేస్తోందన్నారు.
- మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ జగనన్న సైన్యంలో వీరు భాగమయ్యారని పేర్కొన్నారు.
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులకు లేని అవకాశం వలంటీర్లకు సీఎం జగన్ కల్పించారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సహకారం మరువలేనిదన్నారు.
- ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్ మాట్లాడుతూ.. ప్రజల్లో వలంటీర్లకు విపరీతమైన క్రేజీ ఉందన్నారు. సేవలతో వారు ప్రజల్లో మమేకమై పోయారన్నారు.

చాలా సంతోషంగా ఉంది



సేవా రత్న అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రతి రోజు నా పరిధిలోని కుటుంబాలను పలకరిస్తాను. ప్రభుత్వం నుంచి ఏమైనా సంక్షేమ పథకాలు వస్తే వాటి గురించి వివరిస్తాను. అర్హులు ఉంటే దరఖాస్తులు తీసుకుంటాను. వైఎస్ఆర్ చేయూత, ఆరోగ్యశ్రీ కార్డులను అర్హులందరికీ అందేలా కృషి చేశాను.

– నరసింహారెడ్డి, సేవారత్న అవార్డు గ్రహీత, దేవనగర్, కర్నూలు

అర్హులకే సంక్షేమ పథకాలు



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాను. అందులో భాగంగానే అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీకార్డులు వచ్చేలా చేశాను. అర్హులై ఉండి అమ్మఒడి పథకం అందని వారితో గ్రీవెన్స్‌లో న్యాయం చేశాం. నా పరిధిలో కాలువలు, రోడ్లు శుభ్రంగా లేకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాగు చేయిస్తున్నాను.

– ఎస్.అనూష, సేవామిత్ర అవార్డు గ్రహీత, ధర్మపేట, కర్నూలు

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం. ప్రజా సేవ చేస్తే పేరు, ప్రఖ్యాతులు, మర్యాదలు వాటంతటవే వస్తాయి. మేము ఈరోజు ఎక్కడికి వెళ్లినా వలంటీర్ వచ్చాడు అంటున్నారు. మా పరిధి వరకు మా సేవలను విస్తృతంగా అందిస్తున్నాం. సంక్షేమ పథకాలకు అర్హులనే ఎంపిక చేస్తున్నాం. వార్డుల్లోని ప్రజల ఇబ్బందులను తెలుసుకుంటున్నాం.

– ఎం.అనిల్, సేవా వజ్ర అవార్డు గ్రహీత, 17వ వార్డు, కర్నూలు

బ్యుటీషియన్ రంగంలో ఉచిత శిక్షణ

● జూన్ 10 నుంచి శిక్షణ కార్యక్రమం ప్రారంభం


కర్నూలు(అగ్రికల్చర్): కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా కర్నూ లు, నంద్యాల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలకు బ్యుటీషియన్ రంగంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ బి.శివప్రసాద్ తెలిపారు. 30 రోజుల శిక్షణ కార్యక్రమం జూన్ నెల 10న మొదలై 30 రోజుల పాటు సాగుతుందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు వారై చదవడం, రాయడం వచ్చి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 90007 10508 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కురువ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

నంద్యాల(అర్బన్): జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థిని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం ఉపాధ్యక్షుడు కత్తి శంకర్ తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన అర్హులైన ప్రతిభావంతులు ఈనెల 21వ తేదీ లోగా మార్కుల జాబితా, కుల, సర్టిఫికెట్లను 9440756199, 9031241194 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి, నాయకులు జగదీష్, అల్లబాబు, లింగమయ్య, కిశోర్, శ్రీనివాసులు, నాగరాజు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలు 'ఫుల్'

● నో అడ్మిషన్ బోర్డు పెట్టిన ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాల
● ఇప్పటికే ఒక్కో తరగతికి 400 మంది విద్యార్థులు
● అయినా ప్రవేశాల కోసం క్యూ కడుతున్న తల్లిదండ్రులు





నోటీసు బోర్డులో నో అడ్మిషన్స్ అని రాసిన దృశ్యం, ఆదోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల

ఆదోని అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో సర్కార్ స్కూళ్లలో ప్రవేశాలు ఏడాదికేడాదికి పెరుగుతున్నాయి. విద్యార్థులు ఎక్కువ కావడంతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నో అడ్మిషన్ బోర్డులు పెడుతున్నారు. ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ పాఠశాలలో ప్రస్తుతం 6 నుంచి 10వ తరగతి వరకు 1,985 మంది విద్యార్థులు ఉన్నారు. 7వ తరగతిలో 375, 8వ తరగతిలో 410 మంది, 9వ తరగతిలో 495 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ఒక్కొక్క తరగతికి నాలుగు గదులు కేటాయించారు. ఒక తరగతి గదిలో 95 మంది నుంచి వంద మంది వరకు కూర్చొంటున్నారు. తరగతి గదిలో కూర్చోడానికి స్థలం కూడా ఉండడం లేదు. ఈ నేపథ్యంలో నో అడ్మిషన్ బోర్డును ఏర్పాటు చేశారు.

అన్ని రకాల సౌకర్యాలు

విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారు. నాడు–నేడు కింద పాఠశాలల రూపురేఖలను మార్చారు. ప్రతి ఒక్క పేద విద్యార్థి చదవాలన్న ఉద్దేశంతో అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, దుస్తులు, షూష్, టై ఉచితంగా అందిస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం అమలు, డిజిటల్ విద్యా బోధన సాగుతుండడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1,300 మంది విద్యార్థులు ఉండేవారు. ప్రతియేటా 600 నుంచి 700 మంది పెరుగుతూ ప్రస్తుతం 1,985 మంది కి చేరారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి మరో వెయ్యి మంది విద్యార్థులు చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ పాఠశాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో రూ.94 లక్షలు మంజూరు చేసింది. రెండో విడతలో మరో 14 గదుల కోసం ఒక్కొక్క గది ఏర్పాటుకు రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసింది. త్వరలో ఈ పనులు పూర్తి కానున్నాయి.

ప్రవేశాల్లో 'ప్రభుత్వ' విద్యార్థులకు ప్రాధాన్యం

వందలాది మంది ప్రయివేట్ పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు మున్సిపల్ హైస్కూల్‌కు క్యూ కడుతున్నారు. అడ్మిషన్లు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే నోటీసు బోర్డులో 'నో అడ్మిషన్' అని ఉంచామని ఉపాధ్యాయులు చెప్పారు. మొట్టమొదట ప్రభుత్వ పాఠశాల వారికే ప్రాధాన్యత ఇస్తామని, అనంతరం ప్రయివేట్ పాఠశాలల వారికి అవకాశం ఇస్తామని తెలిపారు.

మిగిలితే ఇస్తాం



ప్రైవేట్ పాఠశాలల్లో చదివించలేకపోతున్నామని, ఇక్కడ సౌకర్యాలు బాగా ఉన్నాయని, ఎలాగైనా తమ విద్యార్థులను చేర్పించుకోవాలని తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో మేం నో అడ్మిషన్ బోర్డును అతికించాం. మొదటి ప్రాధాన్యత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తాం. ఆ తర్వాత సీట్లు మిగిలితే ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం.

– అలీంసిద్దిఖీ, పాఠశాల హెచ్‌ఎం

ఆడిటర్ల ఎంపిక నిర్ణయం పీఏసీఎస్‌లదే

కర్నూలు(అగ్రికల్చర్): ప్రాథమిక సహకార పరపతి సంఘాలలో ఆడిటర్ల ఎంపికను ఆయా సంఘాలే చేసుకునేలా ఏపీ కో–ఆపరేటివ్ యాక్ట్ సెక్షన్ 50ని ప్రభుత్వం సవరించింది. 2022–23లో పీఏసీఎస్‌లలో జరిగిన లావాదేవీలపై ఈ ఏడాది జూన్ చివరిలోపు ఆడిట్ పూర్తి చేయాల్సి ఉంది. 2021–22 వరకు సహకార శాఖకు చెందిన ఆడిటర్లే పీఏసీఎస్‌ల్లో లావాదేవీలను ఆడిట్ చేస్తున్నారు. ఏపీ కోఆపరేటివ్ యాక్ట్ 1964 సెక్షన్ 50 సవరణకు అనుగుణంగా 2022–23లో జరిగిన లావాదేవీలపై ఆడిట్ నిర్వహించుకునేందుకు ఆడిటర్లను ఎంపిక చేసుకునే అవకాశం పీఏసీఎస్ పాలకవర్గాలకు, సీఈవోలకు దక్కింది. చార్టెడ్ అకౌంటెంట్ల జాబితా సహకార శాఖ రూపొందించింది. ప్రతి ఏటా లావాదేవీలపై ఆడిట్ నిర్వహించేందుకు సహకార శాఖ ఆడిటర్లు కావాలా.. చార్టెడ్ అకౌంటెంట్లు కావాలనే అనే దానిపై సహకార శాఖ ఆడిట్ అధికారులు ఆప్షన్ కోరుతున్నారు. చార్టెడ్ అకౌంటెంట్లతో ఆడిట్ చేయించుకుంటే సహకార శాఖ ఆడిటర్లు కరెంటు ఆడిట్ నిర్వహిస్తారని సహకార శాఖ జిల్లా ఆడిట్ అధికారులు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



రంగయ్య (ఫైల్)

గూడూరు: పట్టణానికి చెందిన మాదప్ప గాల్ల రంగయ్య (43) అనే వ్యక్తి వడ దెబ్బతో మృతి చెందాడు. శుక్రవారం తన సొంత పొలంలో పనులు చేసుకుంటూ ఎండ తీవ్రతకు సొమ్మసిల్లి పడిపోయి మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కడపరాజుపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పెరుమాళ్ల శాంతయ్య (26) గురువారం అర్ధరాత్రి ఇంటి వరండాలోని ఇనుపరాడ్డుకు ఉరేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శాంతయ్యది నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివాపురం గ్రామం కాగా, కడపరాజుపల్లెకు చెందిన గోన రంగయ్య కుమార్తె శాంతకుమారిని వివాహం చేసుకుని ఇక్కడే నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏ కారణం లేకుండా ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చీటింగ్ కేసులో ఇరువురికి జైలు శిక్ష

కోవెలకుంట్ల: నకిలీ పాసుపుస్తకాలు సృష్టించిన కేసులో ఇద్దరు వ్యక్తులకు శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జైలు శిక్ష పడింది. ఎస్‌ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి, రఘునాథ్ ఫోర్జరీ సంతకాలతో నకిలీ పాసుపుస్తకాలు సిద్ధం చేసి పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు సుబ్బారెడ్డికి 2017లో పొలం అమ్ముతామని రూ. 2.50 లక్షలు అడ్వాన్స్ తీసుకున్నారు. పొలం రిజిస్ట్రేషన్ సమయంలో విషయం బయట పడటంతో తీసుకున్న డబ్బులు వెనక్కు ఇవ్వాలని బాధితుడు అడిగినా ఇవ్వకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. కేసు విచారణలో ఉండగా కోవెలకుంట్ల కోర్టులో కేసు నిర్ధారణ కావడంతో ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం



రాష్ట్ర స్థాయి చెస్ పోటీల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా తదితరులు

నంద్యాల(న్యూటౌన్): క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో రామకృష్ణ పీజీ కళాశాల ఆవరణంలో జూన్ 8 నుంచి 11వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల వాల్ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మాట్లాడుతూ నంద్యాల జిల్లా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నంద్యాల ప్రాంతంలో చెస్‌కు విశేష ఆదరణ రావడంలో అసోసియేషన్ కృషి ప్రశంసనీయమన్నారు. చెస్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ చైర్మన్ హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ పోటీల్లో విజేతలకు రూ. 50వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీ, పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే వారికి మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈనెల 31లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9010451585ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బెస్త సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఏఆర్ పోలీస్ దర్బార్‌లో ఎస్పీ హామీ





దర్బార్‌కు హాజరైన ఏఆర్ పోలీసులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: సిబ్బంది సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో ఎస్పీ పోలీస్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమస్యలు ఉంటే నేరుగా తనను కలసి, లేదా వాట్సాప్ ద్వారా కానీ సమాచారం తెలియజేయవచ్చన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వేసవి తీవ్రత నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. పలు సమస్యలను ఏఆర్ పోలీసులు ఎస్పీ దృష్టికి తీసుకురాగా.. తగిన పరిష్కారం చూపుతానని భరోసా కల్పించారు. విధుల్లో మంచి ప్రతిభ కనపరచిన వారికి ఒక కమిటీ ఏర్పాటు చేసి పారదర్శకంగా అవార్డులు అందజేస్తామని ఎస్పీ తెలిపారు.

స్పెషల్ పార్టీ సిబ్బందికి జంగిల్ యూనిఫాం కిట్

స్పెషల్ పార్టీలో విధులు నిర్వహించే సిబ్బందికి జంగిల్ యూనిఫాం కిట్‌ను అందజేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. బయటి డ్యూటీలకు వెళ్లినప్పుడు సిబ్బందికి తగిన వాహనాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. 50 ఏళ్ల వయస్సు దాటి పికెట్, ఇతర విధులు నిర్వహించే వారికి తగిన పర్మిషన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, డీపీఓ ఏఓ సురేష్ బాబు, ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా, ఆర్‌ఐలు వీఎస్ రమణ, పోతుల రాజు, శివారెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు 49 మంది ఎంపిక

కర్నూలు(సిటీ): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు (స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్స్) పేరిట ప్రభుత్వం సత్కరించనుంది. అవార్డుల ప్రదానోత్సవాలను నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహించేందుకు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 49 మంది విద్యార్థులు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికయ్యారు. అలాగే జిల్లాస్థాయిలో టాప్–3 మార్కులు సాధించిన విద్యార్థులు ముగ్గురు ఉన్నారు. జిల్లాస్థాయిలో టాపర్‌గా నిలిచిన ముగ్గురు పదో తరగతి విద్యార్థులకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.15 వేలు నగదు బహుమతి అందజేయనున్నారు. అలాగే పదో తరగతి నియోజకవర్గ టాపర్లకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రెండో బహుమతిగా రూ.10 వేలు, మూడో బహుమతిగా రూ.5 వేలు నగదు అందజేస్తారు. ఇంటర్మీడియట్‌లో టాపర్లకు రూ.15 వేలు చొప్పున నగదు అందజేస్తారు.

టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు

పగిడ్యాల: ఎం. ఘణపురం గ్రామ పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పథకం పనుల్లో అక్రమాలు చోటు చేసుకోవడంతో టెక్నికల్ అసిస్టెంట్ రంగారెడ్డి, ఫీల్డ్‌అసిస్టెంట్ నాగేంద్రకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. 'బోగస్ హాజరుతో బొక్కేశారు' అనే శీర్షికన గురువారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్లకు శుక్రవారం ఎంపీడీఓ వెంకటరమణ షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఉపాధి కూలీలను వ్యక్తిగతంగా విచారించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పేర్కొన్నారు. జిల్లా అధికారులు కూడా విచారణ నిమిత్తం వస్తారన్నారు. అక్రమాలు నిర్ధారణ అయితే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఉమ్మడి జిల్లాలో నూతన ఏఎస్పీల నియామకం

● కర్నూలుకు సర్కారు, నంద్యాలకు వెంకటరాముడు






జి.వెంకటరాముడు టి.సర్కారు

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లా పోలీసు శాఖలో ఇద్దరు నూతన అడిషనల్ ఎస్పీలు నియమితులయ్యారు. విజయవాడ సిటీ ట్రాఫిక్ డీసీపీగా పనిచేస్తున్న టి.సర్కారును కర్నూలుకు, కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న గుండ్లమడుగు వెంకట్రాముడుకు పదోన్నతి కల్పించి నంద్యాల అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న డి.ప్రసాద్‌ను విజయవాడ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా, నంద్యాల జిల్లా అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న ఆర్.రమణ విజయవాడ అడిషనల్ డీసీపీ(అటాచ్ డీజీ, కమాండ్ కంట్రోల్)గా బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన వెంకట్రాముడుది వ్యవసాయ కుటుంబం. ఈయన 2012లో గ్రూప్–1 ద్వారా డీఎస్పీ హోదాలో పోలీసు శాఖలో చేరారు. మొదట గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా సేవలందించారు. నెల్లూరు టౌన్ డీఎస్పీగా, విజయవాడ సీఐడీ విభాగంలో ఏడాది, ఆదోని డీఎస్పీగా ఏడాది పాటు పనిచేశారు. 2019 జులై 26 నుంచి ఇప్పటివరకు కర్నూలు ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీగా పని చేశారు. తాజా బదిలీల్లో నంద్యాల అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా నియమితులయ్యారు. అలాగే విజయవాడ సిటీ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న టి.సర్కారు కర్నూలు అడ్మిన్ అడిషనల్ ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. సర్వీసు 11 నెలలు మాత్రమే ఉండటంతో విధుల్లో చేరడానికి ఈయన విముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

తెప్పలో కర్ణాటక మద్యం రవాణా



నిందితుల అరెస్ట్‌తోపాటు స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, తెప్పను చూపుతున్న పోలీసులు

● దాడి చేసి పట్టుకున్న పోలీసులు
● రూ.6 లక్షల విలువైన మద్యం సీజ్
● ముగ్గురు నిందితుల అరెస్ట్

కౌతాళం: తెప్పలో అక్రమంగా కర్ణాటక మద్యాన్ని సరఫరా చేస్తున్న విషయాన్ని తెలుసుకుని శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. కోసిగి గ్రామానికి చెందిన తోవి వినోద్‌కుమార్, కుప్పగల్ శీను, ఉరుకుంద అలియాస్ రాజును అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోసిగి సీఐ ఏరిషావలి, ఎస్‌ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా మాన్వి నుంచి వల్లూరు గ్రామ శివారులోని తుంగభద్ర నది ఒడ్డుకు తెప్పలో మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తెప్ప సాయంతో మోటర్ సైకిళ్లు, బాక్స్‌లతో నది దాటుతుండగా దాడి చేసి నిందితులను పట్టుకున్నామన్నారు. 64బాక్స్‌ల్లో 90 ఎంఎల్ కల్గిన 6,144 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లు, రెండు మోటర్ సైకిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. తుంగభద్ర నది దాటడానికి ఉపయోగించిన తెప్పను కూడా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామని, అక్రమంగా మద్యం తరలించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. దాడుల్లో పోలీసు కానిస్టేబుళ్లు హుసేన్‌బాషా, రామచంద్ర, వీరేష్, నరేంద్ర, రంగన్నలు పాల్గొన్నారు. భారీ మొత్తంలో మద్యాన్ని పట్టుకున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ అభినందించినట్లు సీఐ తెలిపారు.

ఐస్‌క్రీం అమ్ముకొని వస్తూ మృత్యువాత



పందికోన రాజు (ఫైల్)

తుగ్గలి: బైక్‌పై ఐస్‌క్రీం అమ్ముకొని స్వగ్రామానికి వస్తూ తుగ్గలికి చెందిన పందికోన రాజు(38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జీ.ఎర్రగుడి వద్ద గురువారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..పందికోన రాజు(38) బైక్‌పై ఐస్‌క్రీం అమ్ముకొని రాత్రి తిరిగి స్వగ్రామమైన తుగ్గలికి వస్తుండగా మార్గమధ్యలో జీ.ఎర్రగుడి వద్ద ఎద్దులబండిని తప్పించే క్రమంలో అదుపుతప్పి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం గుత్తికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేయగా..అక్కడ చికిత్స పొందుతూ కోలులేక మృతి చెందాడు. మృతునికి భార్య నాగవేణి, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జొన్నగిరి ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో చోరీకి యత్నం

● డ్రైవర్ చాకచక్యంతో అడ్డంగా దొరికిన దొంగ

కొలిమిగుండ్ల: వేగంగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు టాప్‌పై ఉన్న లగేజీని అపహరించేందుకు యత్నించిన ఓ దొంగ.. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో అడ్డంగా దొరికిపోయాడు. గురువారం రాత్రి అనంతపురం జిల్లా గుంతకల్లు నుంచి నెల్లూరుకు బయలు దేరిన సూపర్ లగ్జరీ బస్సు టాప్‌పై జీన్స్ ప్యాంట్లకు చెందిన బ్యాగులు వేశారు. మార్గమధ్యలో తాడిపత్రి నుంచి బయలు దేరిన తర్వాత టాప్‌పైకి ఎక్కిన నందలపాడుకు చెందిన ఏసుబు కొద్ది దూరంలో వెళ్లిన తర్వాత జీన్స్ ప్యాంట్ల బ్యాగులు కిందకు పడవేస్తువచ్చాడు. బస్సు వెనుక మరో వాహనంలో వస్తున్న కొంత మంది వ్యక్తులు వాటిని తీసుకుంటున్నారు. అదే సమయంలో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులు గమనించి బుగ్గ దాటిన తర్వాత బస్సు డ్రైవర్‌కు చోరీ విషయాన్ని చెప్పారు. ఆ సమయంలో బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించాడు. నిర్మానుష్య ప్రదేశం కావడంతో బస్సు అక్కడ నిలిపితే దొంగ తప్పించుకునే ప్రమాదముందని గమనించి బస్సును కొలిమిగుండ్ల మండలంలోని అంకిరెడ్డిపల్లెకు చేరుకున్నాడు. అప్పటికే బస్సులో ఉన్న ప్రయాణికులకు విషయం చెప్పి అప్రమత్తం చేశాడు. బస్సు నిలపగానే డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు క్షణాల్లో కిందకు దిగి దొంగ బస్సు దిగక ముందే పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అంకిరెడ్డిపల్లెకు చేరుకుని వివరాలు సేకరించి దొంగను అదుపులోకి తీసుకున్నారు. ఏసుబుతో పాటు ఇంకా ఎవరెవరు ఉన్నారనే వాటిపై పోలీసులు విచారిస్తున్నారు.